జడివాన

- అయిజలో 133.3 మి.మీ.
- నాలుగు గంటలపాటు వాన బీభత్సం
- రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు
- ఉధృతంగా వాగులు, వంకలు
- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

అయిజ పెద్దవాగు సమీపంలో కర్నూల్ వైపునకు నిలిచిన వాహనాలు

అయిజ-కర్నూల్ రోడ్డులో పెద్దవాగు వరదలో చిక్కుకున్న ట్రాక్టర్‌ను బయటకి లాగుతున్న మరో ట్రాక్టర్

ఉత్తనూర్ సమీపంలో పారుతున్న గంగమ్మ వాగు

ఉండవెల్లిలో పొంగి పొర్లుతున్న వాగు

అయిజ, ఆగస్టు 20 : ఉపరితల ద్రోణి ప్రభావంతో అయిజ మండలంలో వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు ప్రారంభమైన వర్షం ఉదయం 6:30 గంటల వరకు నాలుగు గంటలపాటు ఉరుములు, మెరుపులతో పడింది. భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. అయిజ -కర్నూల్, అయిజ - ఎమ్మిగనూర్ అంతర్రాష్ట్ర రహదారులతోపాటు ఉత్తనూర్ - సింధనూర్, అయిజ -తూంకుంట, అయిజ - చిన్నతాండ్రపాడు గ్రామీణ రహదారులపై ఉన్న వాగులు, వంకలు పొంగి పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయిజ - పులికల్ రహదారిలోని పోలోని వాగుపై డైవర్సన్ రోడ్డు కొట్టుకుపోయింది. రెండ్రోజుల్లో డైవర్సన్ రోడ్డును పునర్నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు. తుపత్రాల, మేడికొండ, కిసాన్‌నగర్, పులికల్, రాఆపురం, బైనపల్లి, ఎమ్మిగనూర్, మంత్రాలయం, బళ్లారి వంటి ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయిజ సమీపంలోని కర్నూల్ రోడ్డుపై ఉన్న వంతెనపై నాలుగు అడుగుల మేర వరద పారడంతో పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. దాదాపు 6 గంటలపాటు అయిజ - కర్నూల్, అయిజ - ఉత్తనూర్ రహదారులపై ప్రయాణికులు నిరీక్షించగా.. మధ్యాహ్నం రాకపోకలకు అనుమతిచ్చారు. అయిజలోని లోతట్టు కాలనీలు భరత్‌నగర్, బుడగ జంగాల కాలనీ, నర్సింహకాలనీ, టీచర్స్ కాలనీ, ఎస్సీ కాలనీ, రంగుపేట, కాళమ్మపేట, తెలుగు పేట తదితర కాలనీలు జలమయమయ్యాయి. పట్టణంలోని పీహెచ్‌సీ ఆవరణ చిన్నపాటి కుంటను తలపించింది. దవాఖానకు వెళ్లేందుకు రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. పొలాల్లోకి వరద చేరగా.. పంట పడైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 133.3 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. 14 ఏండ్లల్లో ఎప్పుడూ ఇంత వర్షం కురవలేదని రైతులు పేర్కొన్నారు. పలు చోట్ల విద్యార్థులు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ బీఎల్. సంతోష్ సెలవు ప్రకటించారు. అయిజ -కర్నూల్ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగును కలెక్టర్ సంతోష్ మంగళవారం సాయంత్రం పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పంట పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

అయిజ రూరల్, ఆగస్టు 20: మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు, విద్యుత్ నిలిచిపోయింది. సంకాపురం పాఠశాల ప్రాంగణమంతా జలమయమైంది. దేవబండ, సంకాపురం, కిష్టాపురం, ఈడిగోనిపల్లి, చిన్నతాండ్రపాడు తదితర గ్రామాల్లో సాగుచేసిన పత్తిపంట పొలాల్లోకి వర్షపు నీరు చేరుకోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వపరంగా రైతులను ఆదుకోవాలని రైతులు అంటున్నారు.

పొంగిపొర్లిన వాగులు

ఉండవెల్లి, ఆగస్టు 20: మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లాయి. కొంత కాలంగా వర్షాలు కురువకపోవడంతో పంటలు ఎండు దశకు చేరుకోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. సోమ, మంగళవారం కురిసిన వర్షాలతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంవృద్ధిగా వర్షం కురవడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బీజీ అయ్యారు.

సంకాపురం పాఠశాల ప్రాంగణంలో చేరిన వర్షపు నీరు

సంకాపురం శివారులో పత్తి పంటలోకి చేరిన వర్షపు నీరును చూపుతున్న రైతు

అయిజ-ఎమ్మిగనూర్ రహదారిలోని డైవర్షన్ రోడ్డుపై పారుతున్న వరద

ఉధృతంగా పారుతున్న పెద్దవాగు

మానవపాడు, ఆగస్టు 20: సోమవారం రాత్రి కురిసిన వర్షంతో మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్య పెద్దవాగు ఉధృతంగా పారుతున్నది. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు నిలిచి పోయాయి. మండలంలోని పైగ్రామాల పరిధిలో కురిసిన వర్షంతో చేరిన నీటితో మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రవాహం పెరిగింది. బ్రిడ్జి పైన మూడున్నర అడుగుల మేర నీటి ప్రవాహం కొనసాగింది. పోలీసులు అక్కడికి చేరుకొని రాకపోకలు నిలిపి వేశారు. పాఠశాల విడిచిన అనంతరం అమరవాయి, ఆముదాలపాడు, నారాయణపురం వెళ్లాల్సిన విద్యార్థులను ఉపాధ్యాయులు బ్రిడ్జి వద్దే నిలిపివేశారు. నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చిన ముల్లపొదలను పోలీసులు తొలగించారు. రాత్రి 7గంటల వరకు నీటి ప్రవాహం కొనసాగింది. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు నిలిచి పోయారు. మానవపాడు, గోకులపాడు మధ్య వాగు బ్రిడ్జి చిన్నగా ఉండడంతో పంట పొలాలగుండా వరదనీరు పారింది. అక్కడ కూడా ప్రజలు రాకపోకలు కొనసాగించకుండా ఎస్సై చంద్రకాంత్ పోలీసులను ఏర్పాటు చేశారు. రాత్రినుంచి తెల్లవారుజాము వరకు 31 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తాసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. వర్షాకాలం వచ్చిన ప్రతిసారి ఇలాగే ఇబ్బందులు పడుతున్నామని కొత్తగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాగు వద్ద పహారా కాస్తున్న పోలీసులు

గట్టులో భారీ వర్షం

గట్టు, ఆగస్టు 20: మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షపాతం 70.4మీ.మీలుగా నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. బోయల గూడెం, ఇందువాసి, లింగాపురం గ్రామాల్లో అధికంగా వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగాయి. బోయల గూడెం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి. వేరే మార్గాల గుండా రాకపోకలు కొనసాగాయి. పంట పొలాల్లోకి భారీగా నీరు చేరింది.

భారీ వర్షానికి నిలిచిన రాకపోకలు

పెబ్బేరు, ఆగస్టు 20: మండలంలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 80 మిల్లీ. మీటర్ల.వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షం కారణంగా కొల్లాపూర్ ప్రధాన రహదారిపై శేరిపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డు పూర్తిగా మునిగి పోవడంతో రాకపోకలు నిలిపివేశారు. శ్రీరంగాపురం మీదుగా వాహనాలు కొల్లాపూర్‌కు మళ్లించారు. పక్కనే తాత్కాలిక రోడ్డును వేశారు. వర్షం ధాటికి ఆ రోడ్డును నీరు ముంచెత్తడంతో అధికారులు అటువైపు వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. పోలీసులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసి, ఎవరూ ప్రమాదం భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

కొల్లాపూర్‌కు రాకపోకలను నిలిపి వేసిన అధికారులు

సీఎంఆర్ఎఫ్‌తో మేలు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

రాజోళి, ఆగస్టు 20: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 8మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.3లక్షల చెక్కులను మంగళవారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, గంగ్గిరెడ్డి, ఉషేన్, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సత్తార్, సర్వేశ్వర్‌రెడ్డి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఇటిక్యాల శాఖ, జోగులాంబ గద్వాల జిల్లా
అనుబంధం-IV [రూల్-8(1)]
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
దిగువ సంతకందారు **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇటిక్యాల శాఖ** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసు నందు వివరించబడిన మొత్తం **రూ. 9,98,912.83 (తొమ్మిది లక్షల తొంబై ఎనిమిది వేల తొమ్మిది వందల పన్నెండు రూపాయల ఎనబై మూడు పైసలు మాత్రమే)** (27.12.2023 నాటికి అసలు ప్లస్ వడ్డీ బకాయిని సూచిస్తుంది) ప్లస్ 27.12.2023 నుండి నేటివరకు వడ్డీ మరియు ఇతర చార్జీలను తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత: శ్రీ మంద మౌలాలి** తండ్రి శ్రీ ఎమ్.సవారన్న లను కోరుతూ **తేది: 24.04.2024** గల **డిమాండ్ నోటీసును** జారీ చేసినారు.
రుణగ్రహీత బ్యాంక్ బకాయిలు తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **20 ఆగస్టు, 2024**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు **రూ. 9,98,912.83 (తొమ్మిది లక్షల తొంబై ఎనిమిది వేల తొమ్మిది వందల పన్నెండు రూపాయల ఎనబై మూడు పైసలు మాత్రమే)** (27.12.2023 నాటికి బకాయి అసలు+ వడ్డీలను సూచిస్తుంది)+ 27.12.2023 నుండి దానిపై వడ్డీ మరియు ఇతర ఖర్చులు సదరు కలిపి మొత్తం కొరకు **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇటిక్యాల శాఖ** యొక్క చార్జ్‌కు లోబడి ఉంటాయని ప్రత్యేకించి రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.
స్థిరాస్తి వివరణ
శ్రీ మంద మౌలాలి తండ్రి శ్రీ ఎమ్.సవారన్నకి స్వంతమై ఉండి, రిజిస్ట్రేషన్ మరియు సబ్‌రిజిస్ట్రేషన్ జిల్లా జోగులాంబ గద్వాల పరిధి, తిమ్మాపురం గ్రామం, ఇటిక్యాల రెవెన్యూ మండలం, సిద్దార్థ్ నగర్ కాలనీ, జోగులాంబ గద్వాల జిల్లా వద్ద గల, సర్వే నెం.435/బి, 434/ఎ, 435/ఎ మరియు 434/బిలో 125.41 చ.మీటర్లకు సమానమైన 150 చ.గజాలు విస్తీర్ణం,ప్లాట్ నెం.107 వద్ద గల భూమి మరియు ఇంటి ఆస్తి, దానిపై ప్రస్తుతమున్న కట్టడాలతో, సరిహద్దులు: తూర్పు: 30అ.రోడ్, పడమర: ప్లాట్ నెం.128, ఉత్తరం: ప్లాట్ నెం.106, దక్షిణం: ప్లాట్ నెం.108
ప్రదేశం: ఇటిక్యాల
తేది: 20.08.2024
అధీకృత అధికారి,
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మల్దకల్‌లో 59.2 ఎం.ఎం వర్షం

మల్దకల్, ఆగస్టు 20: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా 59.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. 20రోజులుగా ఎండగా ఉండడంతో సీడ్ పత్తి, ఇతర పంటలన్నీ వాడుముఖం పట్టాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అన్నిరకాల పంటలకు మేలు జరిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్కూళ్ల ఆవరణలోకి వర్షంనీరు

మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలుగ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో వర్షం నీరు నిలిచింది. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, చర్లగార్లపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలల ఆవరణల్లోకి నీరు చేరుకుంది. మంగళవారం ఉదయం విద్యార్థులు ఈ నీళ్లలోనే నడుచుకుంటూ వెళ్లారు. కాగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ వర్షం కురిసిన ప్రతీసారి ఇదే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులు వచ్చివెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పిడుగుపాటుతో పంటనష్టం

మల్దకల్, ఆగస్టు 20: మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బోయ పరశురాముడు అనే రైతుకు చెందిన సీడ్‌పత్తి పంటపై పిడుగు పడటంతో దాదాపు అర ఎకరంలో పంటనష్టపోయానని రైతు పరశురాముడు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మాట్లాడుతూ గత 20 రోజులుగా సీడ్‌పత్తి పంటను క్రాసింగ్ చేశామని, ఇప్పుడిప్పుడే పత్తి మొక్కలపై కాయలు కుదురుకున్నాయన్నారు. కానీ పిడుగుపడడంతో కాయలు, మొగ్గలు మొత్తం రాలిపోయాయని చెప్పారు. ఇప్పటికే ఈ పంటకు పెట్టుబడి రూ.3లక్షల వరకు అయ్యిందన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

వరద నీటిలో కొట్టుకుపోయిన బ్రిడ్జి నిర్మాణ సామగ్రి

ఇటిక్యాల, ఆగస్టు 20: సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం దాకా కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు వంకలు పొంగి పొర్లాయి మండలంలోని సాతర్ల వాగు ఉధృతంగా ప్రవహించి ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వాగుపై నిర్మించిన బ్రిడ్జి పనులకు నిల్వ ఉంచిన 150సంచుల సిమెంట్, నిర్మాణ సామగ్రి వర్షపు నీటిలో కొట్టుకుపోయినట్లు మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి తెలిపారు. వారం, పదిరోజులుగా తీవ్రమైన ఎండలు ఉక్కపోతలతో సతమతమైన ప్రజలు, రైతులకు వర్షం రాక సంతోషం కలిగించిందనే చెప్పవచ్చు. వర్షాధారంగా సాగుచేసిన పంటలు ముఖ్యంగా పత్తి, మిరప పంటలకు ఈ వర్షం జీవం పోసిందనే చెప్పవచ్చు.

ఉధృతంగా పారుతున్న జూలేకల్ వాగు

జూలేకల్ వాగులో రాకపోకలు బంద్

వడ్డేపల్లి, ఆగస్టు 20: ప్రధాన రోడ్డు పైకెక్కి నీళ్లు రావడంతో జూలేకల్ వాగులో రాకపోకలు స్తంభించాయి. కలుకుంట్ల, బొంకూరు వద్ద బ్రిడ్జిలు నిర్మించారు.. కాని జూలేకల్ వాగు గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని రవిచందర్, చంద్రశేఖర్‌గౌడ్, వీరేశ్, నాగరాజు, ఇబ్రహీం తదితరులు వాపోయారు. భారీ వర్షం వచ్చిందంటే చాలు వాగు పొంగి ప్రధాన రోడ్డెక్కి నీళ్లు పారుతుండడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు, నాయకులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

మరోఐదు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

గద్వాల అర్బన్, ఆగస్టు 20: భారీ వర్షాల నేపథ్యంలో వచ్చే ఐదు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ యాక్ట్‌పై జిల్లాలోని మేధావులు, సీనియర్ సిటిజన్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించి, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఎల్‌ఆర్ఎస్, ధరణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి ప్రభుత్వ కార్యదర్శి శాంతకుమారి ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో కలెక్టర్‌లు, జిల్లాస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం, ఆస్తినష్టం కలుగకుండా చూడాలని చెప్పారు. అవసరమైతే పాఠశాలలకు సెలవులు ప్రకటించాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే రెవెన్యూ యాక్ట్‌పై జిల్లాలో 23 లేదా 24వ తేదీలో జిల్లా స్థాయిలో మేధావులు, సీనియర్ సిటిజన్, సీనియర్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించాలని, నివేదికలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తులు అధికశాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి అర్హత గల దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. ప్రత్యేక బృందాలను నియమించి రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సంబంధిత సిబ్బంది ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలించి సరైన వాటిని పరిష్కరించాలన్నారు. ఈ వీసీలో కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస రావు,నర్సింగ్ రావు, ఇతర శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

ఆత్మీయతకు ప్రతీక రాఖీపండుగ

- మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సోదరితో రాఖీ కట్టించుకుంటున్న నిరంజన్‌రెడ్డి

పాన్‌గల్, ఆగస్టు 20: ప్రేమానురాగం, ఆత్మీయతకు ప్రతీక రాఖీపండుగని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని స్వగ్రామంలో నిరంజన్‌రెడ్డి సోదరీమణులు అనసూయమ్మ, సుదర్శణమ్మ, బాలకిష్టమ్మ, శేషిరేఖమ్మతో రాఖీలు కట్టించుకొని అక్కలకు పాదనమస్కారం చేసి వారి ఆశీర్వాదం అందుకున్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆడపడచులందరికి రాఖీపండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య నాయుడు, అడివన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి

- రాబోయే రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు
- ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా చూడాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఆగస్టు 20: రానున్న ఐదురోజులు జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ధరణి ఎల్ఆర్ఎస్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. ఖమ్మ జిల్లా నుంచి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై కలెక్టర్లకు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్‌లో చేసుకున్న దరఖాస్తులు, ధరణి పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, జెడ్పీ సీఈవో యాదయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ రాజశేఖరం, డీఈ శ్రీనివాస్, డీపీవో రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు పూర్ణచందర్, సూర్యకుమార్ తదితరులు ఉన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వైద్య కళాశాలను సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో తరగతి గదులు, ఫర్నీచర్, నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, నిర్మాణ పనుల వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాను నమోదు చేయాలి

2007 జవవరి 1కంటే ముందు జన్మించిన వారిని కొత్త ఓటరు జాబితాలో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీల నుంచి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని, తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల సహకారం తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ 18వరకు బీఎల్‌వోలు ఇంటింట సర్వేలు నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, ఎలక్షన్ సూపరింటెండెంట్ కిషన్‌నాయక్, వివిధ పార్టీల ప్రతినిధులు రాజేంద్రప్రసాద్ యాదవ్, వేణాచారి, ఎండీ జబ్బార్, జలీల్, కుమారస్వామి, రవి, నాగరాజు, బాలరాజు తదితరులు ఉన్నారు.

శంకర్‌లాల్‌ను సన్మానిస్తున్న డీఏవో, డీలర్లు

అయిజ, ఆగస్టు 20: ప్రజలకు అహర్నిశలు సేవ చేయడంతోనే ఆదరాభిమానాలు సంపాదించొచ్చని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్ అన్నారు. మంగళవారం అయిజలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో చేవెళ్లకు బదిలీపై వెళ్లిన ఏవో శంకర్‌లాల్‌కు వీడ్కోలు, కొత్త ఏవో జనార్దన్‌కు స్వాగత సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్త ఏవో జనార్దన్‌కు పాత ఏవో బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్, సీడ్స్, పెస్టిసైడ్స్ డీలర్లు, యజమానులు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా మంజూరుకు ప్రతిపాదనలు

- గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్, ఆగస్టు 20: జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పిడుగులు పడి ముగ్గురు చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలంపూర్ మండలం క్యాతూరుకు చెందిన వేముల రాజు, గట్టు మండలం ఆరగిద్ద గ్రామానికి చెందిన తలారి నల్లారెడ్డి, మల్దకల్ మండలంలో కర్నూల్ జిల్లా నందవరం కనకవీడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి పేర్లను ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.

వెంచర్ పరిశీలన

వడ్డేపల్లి, ఆగస్టు 20: శాంతినగర్ జెడ్పీహెచ్ పక్కనున్న వెంచర్‌ను కలెక్టర్ సంతోష్ మంగళవారం పరిశీలించారు. అలాగే ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం వడ్డేపల్లి గట్టు సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. తాశీల్దార్ శ్రీనివాస్ శర్మ జోషి, ఆర్ఐ ఆంజనేయులు, టీపీవో కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో సిద్ధప్ప

గద్వాల అర్బన్, ఆగస్టు 20: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి సిద్దప్ప హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వడ్డేపల్లి, రాజోలి, అయిజ పీహెచ్‌సీలలో పని చేస్తున్న సిబ్బందితో సమీక్ష నిర్వహించి, విధుల విషయంలో ఆరా తీశారు. అలసత్వం వహించే వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోసారి తప్పిదాలు జరుగకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు రాజు, రిజ్వానా తన్వీర్, ప్రసూన రాణి ఉన్నారు.

ఇండ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఇండ్ల పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని పారబోసి, ఏరోజుకారోజు నీటిని వినియోగించుకోవాలని మల్లేరియా ఇన్‌చార్